❖•❖•❖ 5 ❖•❖•❖

# యేసు ప్రార్థనలకు ప్రత్యుత్తరము ఇవ్వబడినదా?

*"శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను" (హెబ్రీయులకు 5:7).*

గెత్సేమనే తోటలో, యేసు తన ముగ్గురు శిష్యుల దగ్గర నుండి కొంత దూరము వెళ్లి, మోకాళ్లూని, దేవుని యెదుట సాగిలపడ్డాడు. "నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అని ఆయన ప్రార్థించాడు (మత్తయి 26:39). తరువాతి గడియలో, మరి రెండు పర్యాయములు ఈ ఒంటరి చోటుకు తిరిగి వచ్చి ఆయన మీద పడుచుండిన గొప్ప పరీక్ష ద్వారా తన తండ్రి చిత్తము నెరవేరవలెనని ప్రార్థించాడు. చివరి రెండు ప్రార్థనలలో గల స్ఫూర్తి ఆయన చేసిన సంక్షిప్త యాచనలో: "నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నాయొద్దనుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించునుగాక" అను కొన్ని మాటలలో స్పష్టముగా తెలియజేయబడి యున్నది (మత్తయి 26:42).

యేసు దేవుని పాపరహితుడైన కుమారుడై యుండెను. ఆయన చేసిన విధముగా పుడమిపై జీవించిన వారెవరైనను ఎప్పుడైనను చేయలేదు, ఇది స్వయంవిదితము. మోషే, సమూయేలు మరియు దానియేలు, ప్రార్థన విషయములో వారు మనఃపూర్వకముగాను విశ్వాసనీయముగాను ఉండినను, యేసు చేసిన పరిపూర్ణమైనదియు, చిత్తశుద్ధియునైన ప్రార్థనకు సాటికాలేకపోయారు. గెత్సేమనే తోటలోని ఒలీవ చెట్ల ఛాయలో నీతియుక్తముగాను మనస్ఫూర్తిగాను యేసు చేసినట్లు చేసిన మరెవరి చరిత్రనైనను చూడలేదు.

మనము ఆయన చేసిన ప్రార్థనలు వింటూ ఆయన పడిన వేదనను మరియు అనుభవించిన దుఃఖమును గమనించినట్లయితే, "ఆయన చేసిన ప్రార్థనలకు ప్రత్యుత్తరము వచ్చినదా?" అను ప్రశ్న మన తలంపులను తట్టును. ఆయన చేసిన మనవి కేవలము ఆ "గిన్నె" తన యొద్దనుండి తొలగిపోవుట కొరకే అయియుండినదని మనము అనుకొన్నట్లయితే, "లేదు" అనునది మన ప్రశ్నకు జవాబు. నాలుగు సువార్తల వృత్తాంతములు తెలియజెప్పుచున్న తదుపరి చరిత్ర యేసు సిలువ మరణమునొందుటతో, అనగా, గిన్నె లోనిది ఆయన త్రాగిన విషయముతో గల సంబంధమును సూచించుచున్నది. యేసు మన పాపములను భరించినప్పుడు తన తండ్రి వేరుచేయబడిన ఆ భయంకరమైన గడియ గూర్చి అవి మనకు వివరించుచున్నవి. యేసు చేసిన ప్రార్థన ప్రకారము ప్రత్యుత్తరమిస్తూ దేవుడు పాపభూయిష్టమైన మానవాళికి రక్షణను సమకూర్చు కార్యము కూడా చేయలేదు గనుకనే యేసు చేసిన ప్రార్థనలోని ఈ భాగమునకు దేవుడు సరేననలేదు.

ఏదిఏమైనా, ఆయన చేసిన ప్రార్థనలోని స్ఫూర్తి గూర్చి మనము ఆలోచించినట్లయితే – ఆయన చేసిన ఒక్కొక్క విన్నపము యందంతటను కనబడు మూలాధారమైన అంకిత భావముతో కూడిన ఆలోచన – యేసు చేసిన ప్రార్థనలను దేవుడు ఆలకించాడనియు

వాటికి ప్రత్యుత్తర మిచ్చాడనియు మనము గ్రహించుదుము. ఈ సత్యము ప్రత్యేకముగా హెబ్రీయులకు 5:7లో బయటపెట్టబడినది. "ఆయన శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను" అని రచయిత చెప్పుచున్నాడు.

"ఆయన శరీరధారియై యున్న దినములలో" అను పదబంధము యేసు యొక్క ఇహలోక జీవితము మరియు పరిచర్యను సూచించుచున్నది. "మహా రోదనముతోను కన్నీళ్లతోను" అను పదబంధము గెత్సేమనే తోటలో ఆయన చేసిన ప్రార్థనల గూర్చి ఒక ప్రత్యేక ప్రసక్తియై యుండును. సువార్తల వృత్తాంతములు ఆయన కన్నీటిని పేర్కొనుట లేదు, కానీ తోటలో జరిగిన పోరాటమును – మాటలు దాని పరిమాణములను వివరించలేనంతటి తీవ్ర యుద్ధమును – చిత్రీకరించుచున్నవి. యేసు ప్రార్థన చేయుటకు మోకాళ్లూనినప్పుడు, ఆయన బహుగా యాతనపడ్డాడు, మిక్కిలి దుఃఖముతో నిండిపోయాడు, మరియు విచారము ఆయనపై దాదాపుగా విజయము సాధించినంత పనయ్యింది. "మహా రోదనముతోను కన్నీళ్లతోను" అను మాటలు అత్యంత లోతైన భావోద్రేకములను వివరించుచున్నవి. "ప్రార్థనలు" అవసరమైన వాటి కొరకైన విన్నపములు, మనఃపూర్వక మనవులునై యున్నవి; "యాచనలు" చిత్తశుద్ధితో కూడిన విజ్ఞప్తులై యున్నవి. ఆయన "మహా రోదనముతోను కన్నీళ్లతోను" ప్రార్థించెనను సత్యముతో "ప్రార్థనలను," "యాచనలను" మనము జతచేసినప్పుడు, బైబిలంతటిలో గల మనస్సును కరిగించే సన్నివేశములలో ఒకటి మనమిక్కడ చూడగలము.

హెబ్రీయులకు 5:7 "భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను" అని కూడా చెప్పుచున్నది. ఔను, యేసు ప్రార్థనలకు ప్రత్యుత్తరమివ్వబడినదని రచయిత చెప్పుచున్నాడు. దేవుడు యేసు యొక్క దైవభక్తిని, దైవ భయమును మరియు దేవుని చిత్తము యెడల ఉండిన పూజనీయతను చూచి, యేసు చేసిన మనవులను అనుగ్రహించాడు. కొంచెమాలోచించినట్లయితే, జవాబులియ్యబడిన విధానములను మనము చూడగలము.

*మొదటిదిగా, ఆయన దూతల చేత బలపరచబడినాడని మనము గమనించగలము.* యేసు మొదటిసారి ప్రార్థన చేసిన తరువాత, ఒక దూత వచ్చి ఆయనకు ఉపచారము చేసెనని లూకా చెప్పుచున్నాడు. "అప్పుడు పరలోకమునుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను" అని లూకా రచించాడు (లూకా 22:43). యేసు పొందిన బలము యొక్క స్వభావమేమిటో మనకు ఖచ్చితముగా తెలియదు, కానీ ఆయన తన యెదుట నుండిన శ్రమను భరించగలుగునట్లు యేసు శరీరము దైవికముగా పోషింపబడినదై యుండును. దేవుడు యేసును మరణము *నుండి* తప్పించుట లేదు, కానీ ఆ మరణము *ద్వారా* ఆయనను విడిపించును. యేసు చేసిన ప్రార్థనలకు దేవుని ప్రతిస్పందనలు మండుచుండిన అగ్ని గుండములో వేయబడిన షద్రకు, మేషాకు మరియు అబేద్నెగో అను వారికి ఇచ్చిన దాని వలెనే ఉండును (దానియేలు 3:26). వారిని అగ్ని గుండములో నుండి విడిపించుటకు ఆయన ఎన్నుకొనలేదు; అందులోనే వారిని ఆదుకొనుటకు ఆయన ఎన్నుకొన్నాడు. యేసు సిలువ వేయబడినప్పుడు ఆయనను ఆదుకొనుట మాత్రమే గాక, ఆయనను మృతులలో నుండి లేపుట ద్వారా సమాధిలో నుండి ఆయనను విడిపించెను.

*ఇంతేగాక, యేసు సిలువ మరణమును ప్రశాంతముగాను దైవిక హుందాతనముతోను*

*ఎదుర్కొనునట్లు ఆయనను సిద్ధపరచుట ద్వారా దేవుడు ఆయన ప్రార్థనలు ఆలకించాడు.* తీర్పు తీర్చబడుచుండినప్పుడుగాని ఆయన సిలువ వేయబడినప్పుడు గాని మన ప్రభువు ప్రవర్తించిన తీరు యొక్క వివరములను అర్థంచేసుకొని లోప రహితమైన నడవడిక గూర్చి మనస్సులో మంచి అభిప్రాయము ముద్రవేయబడకుండా ఎవరునూ ఉండలేరు. యేసు అనుభవించినటువంటి శ్రమలను చరిత్రలో ఎవరును ఎప్పుడైనను ఎదుర్కొనలేదు. యేసుతో కూడా సిలువవేయబడిన దొంగలలో ఒకడు ఆయన మెస్సీయాయని ఒప్పింపబడి గుర్తించునట్లును ఆయన రాజ్యములో వానికి చోటివ్వవలెనని ఆయనను వేడుకొనుటకు ప్రేరేపించబడునట్లును ఆయన యొక్క దైవిక వైఖరి ఆయనకు సహాయపడినది, ఇందులో సందేహము లేదు (లూకా 23:42). సిలువ సమీపించుచుండిన కొలది యేసు దేహము కంపించి యుండవచ్చును, కానీ ఆయన హృదయము సంపూర్ణముగా దేవుని చిత్తమునకు అధీనమైపోయింది. ఆయన తోటలో చేసిన ప్రార్థనలకు ప్రత్యుత్తరముగా, దేవుడు యేసు అంతరంగమునకు ఆత్మస్థైర్యమును మరియు మరణావస్థలో నుండిన అగ్ని పరీక్షకు అవసరమగు ఆధ్యాత్మిక వివేచనను అనుగ్రహించాడు.

*అంతమాత్రమే గాక, ఆయనకు మహిమకు తెచ్చుటకు దేవుడు యేసు మనవిని అనుగ్రహించాడని మనము చూచుచున్నాము.* అది ఆయన చిన్న గెత్సేమనే తోట అని పిలువబడిన తోటలో, "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది; నేనేమందును? తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని; తండ్రీ నీ నామము మహిమపరచుము" అని యేసు అంతకు మునుపు చెప్పాడు (యోహాను 12:27, 28ఎ). దీనికి ప్రత్యుత్తరముగా, "నేను దానిని మహిమ పరచితిని, మరల మహిమ పరతును" అని ఒక శబ్దము ఆకాశము నుండి వచ్చెను (యోహాను 12:28బి). ఆ సమయములో యేసు చుట్టూర ఉండిన ప్రజలలో కొందరు అది ఉరుముడు శబ్దమని అనుకొన్నారు, ఆయనతో దేవదూత మాట్లాడెనని ఇతరులు అనుకొన్నారు (యోహాను 12:29). ఆయనకు ఇవ్వబడగల ఎటువంటి శారీరక ఉపశమనమును మించి, వ్యక్తిగత బాధనుండి ఏ విధముగానైనను తప్పించుకొనుట కంటె ఎక్కువ, తండ్రికి మహిమ తీసుకొనిరావలెనని యేసు కోరాడు. ఈ లక్ష్యమునే ఆయన తన హృదయములోను ప్రార్థనలలోను అనుసరించాడు.

దేవుడు ఆయన ప్రార్థనలలోని ఈ భాగమును విన్నాడా? ఔను, నిజముగా విన్నాడు. మనము సిలువ సంఘటనలను అవలోకనము చేసుకొనుచు, యేసు తన శత్రువుల యెడల, హింసాత్మకమైన శ్రమకు మరియు అపహాస్యము మరియు వెక్కిరింతలకును ఎట్లు ప్రతిస్పందించెనో జాగ్రత్తగా గమనించుదము. ఆయన పలుకులు, ప్రవర్తన, మరియు లొంగుబాటు తన తండ్రికి శాశ్వత మహిమను తెచ్చినది.

*ఇంకా, ఆయన తన తండ్రి చిత్తప్రకారము చేయుట ద్వారా యేసు ప్రార్థనలు నెరవేరినవని కూడ మనము చూడగలము.* ఎంతైనా, ఈ కోరిక ఆయన చేసిన మనవులన్నిటికి కేంద్రమై యుండినది. ఆయన ప్రార్థనలు "నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము" అను పదబంధముతో ముడిపడియుండినవి. తన తండ్రి చిత్త ప్రకారమే చేయవలెనను గాఢా వేశముతో ఆయన ఈ తోటలోనికి ప్రవేశించాడు, అదే కోరికతో అక్కడనుండి వెళ్లిపోయాడు. ఇటువంటి కోరికను నిరసించుటయే మంచిదని అపవాది వాని ఉత్తమమును సహేతుకమునైన విజ్ఞప్తి చేయుచూ ఆయనతో వాదించాడు, కానీ దేవుని చిత్తమే సిద్ధించాలని ప్రార్థించుటకు

యేసు కొనసాగించాడు. ఆయన సాతానుపై విజయము సాధించాడు. దేవుడు తన చిత్తమును యేసు ద్వారా అమలుచేయుచు ఈ ప్రార్థనలకు ప్రత్యుత్తరమిచ్చాడు. దేవుడు లోకమునకు రక్షణననుగ్రహించవలెనను తన నిత్య సంకల్పమును నెరవేర్చుకొనుచుండెను. మరియు ఆయన ప్రణాళికలో సిలువ చేర్చబడి యుండెను. మానవాళిని రక్షించు మార్గము దేవునికి మరొకటి లేకుండెను, యేసు తన తండ్రి చిత్తమునకు వినయముతో తల వంచాడు.

యేసు చేసిన ప్రార్థనలు మరియు ఆ ప్రార్థనలకు దేవిడిచ్చిన ప్రత్యుత్తరములనుండి మనము నేర్చుకొను (గుణ) పాఠములు మన హృదయములలో జాగ్రత్తగా దాచుకొనబడవలెను. మొదటిగా, దేవుని చిత్త ప్రకారము చేయుటయే మన ప్రార్థనలకు గల మూలాధారమైన కోరికయై యుండవలెనని అవి మనకు నేర్పించుచున్నవి. ఆయన చిత్తము మన నిమిత్తము మాత్రమే ఉత్తమమైనది కాదు. కాని ఈ లోకమునకు కూడ ఉత్తమమైనదే.

రెండవదిగా, మన శరీరములు దేని కొరకు కేక వేయాలో వాస్తవమునకు ఏమి అవసరమో ఈ రెండూ వెవ్వేరు విషయములై యుండునని ఆయన ప్రార్థనలు మనకు నేర్పించుచున్నవి. మన శరీరములు బాధను నిరోధించుచు సౌఖ్యము కొరకు కేక వేస్తాయి. ఇది శరీర స్ఫూర్తి మరియు లక్షణమైయున్నది. రోగియై యుండిన లాజరు స్వస్థతనొందవలెనని ఆశించాడనుటలో సందేహము లేదు. కానీ ఆ సమయములోను ఆ స్థలములోను అది దేవుని ప్రణాళిక ప్రకారమైనదై యుండినదా? యోహాను 11:4, 15, 25 చూడుము. రోగము చేత బాధపడుచుండిన ఎవరినో ఒకరిని బాగుచేయవలెనని యేసు కోరలేదు; దేవుడు ఆయనను పంపించాడని లోకమునకు ఒక నిదర్శనముండునట్లు ఎవరినో ఒకరిని మృతులలో నుండి లేపవలెనని ఆయన ఆశించాడు. శరీరము చేయుచుండిన పెద్ద గోలను దేవుని మహిమ రద్దుచేసినదని మనము ఆనందించుట లేదా?

మూడవదిగా, నీతిమంతులు చేయు ప్రార్థనలు సాధ్యమైన ఉత్తమ రీతిలో ప్రత్యుత్తరమిచ్చుటకు దేవుడు విశ్వసనీయుడని ఈ ప్రార్థనలు మనకు నేర్పించుచున్నవి. ఆయన ప్రార్థనలు ఆలకించు దేవుడై యున్నాడు! నీతిమంతులు ప్రార్థించినప్పుడు, ఆయన వారికి ప్రత్యుత్తరమియ్యక మానడు. యోహాను మాటలను మనమెన్నడునూ మరువరాదు: "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5:14).

❖♦❖♦❖

*నిజమైన ప్రార్థన ప్రార్థనచేయువాని యిష్టమును వెదకదు; అది అన్నిటికి మించి – మూల్యము, సమయము, లేక వ్యక్తిగత త్యాగముతో నిమిత్తము లేకుండా – దేవుని చిత్తమును వెదకును.*